క్లుప్తంగా

కౌలు కార్డుదారులకు ప్రోత్సాహకాలు

నార్నెపాడు(ముప్పాళ్ళ): కౌలు కార్డుదారులు ప్రభుత్వం అందించే పంట రుణాలు, పంట నష్టపరిహారం, వ్యవసాయ యంత్రపరికరాలు పొందవచ్చని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో గురువారం కౌలు కార్డు(పంటసాగుపత్రం)పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ కార్డు వలన భూయజమాని హక్కులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. భూయజమానికి, సాగుదారునికి మధ్య ఉన్న ఒప్పందపత్రం మాత్రమేనన్నారు. సున్నా వడ్డీ రుణాల ద్వారా కౌలు రైతుల ఖాతాలోనే వడ్డీ జమ అవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డు ఉంటే రైతు భరోసా వర్తిస్తుందన్నారు. పంటలకు మార్కెట్ ధర లేనప్పుడు మద్దతు ధరకు ఆర్బీకేలో అమ్ముకోవచ్చన్నారు. ఆర్ఐ పవన్‌కుమార్, వీఆర్వో సుభాషిని, వీఏఏ లక్ష్మీప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీలలితా పరమేశ్వరి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

నకరికల్లు: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తే పెనాల్టీ చెల్లించాల్సిన అవసరం ఉండదని విద్యుత్ శాఖ ఏఈ రూఫస్ డానియేల్ గురువారం తెలిపారు. విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా, విద్యుత్‌శాఖ యాప్ ద్వారా కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా చెల్లించవచ్చన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడడం ద్వారా బిల్లులు కూడా తక్కువగా వస్తాయన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

సేవా పురస్కారం అందుకున్న డాక్టర్ రమాదేవి




సత్తెనపల్లి: విద్యాపరంగా చేసిన సేవలకు గాను సత్తెనపల్లికి చెందిన డాక్టర్ సరికొండ రమాదేవి ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైంది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం రాజులపాలెం ఎస్టీ కాలనీలో యువనేస్తం అసోసియేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులను గుర్తిస్తూ గురువారం అవార్డులు ప్రదానం చేశారు. దీనిలో భాగంగా సరికొండ రమాదేవి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అవార్డును అందుకున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

పెదకూరపాడు: మహిళలు తీసుకున్న రుణాలతో వ్యాపార అభివృద్ధి సాధించాలని గుడ్‌షెఫర్డ్ సిస్టర్ డైరెక్టర్ ఇన్నరాశి అన్నారు. అమరావతిలో గుడ్‌షెఫర్డ్ సిస్టర్ ఆధ్వర్యంలో యుప్రేసియా కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు మండలాల్లోని మహిళలకు వ్యాపారాభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రేస్ సంస్థ డైరెక్టర్ జి.నళిని శిక్షణ ఇచ్చారు. అనంతరం సిస్టర్ ఇన్నరాశి మాట్లాడుతూ మహిళలు నూతన వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. వ్యాపారాభివృద్ధికి 30 మంది మహిళలకు రూ.5.10 లక్షలు రుణంగా ఇచ్చామన్నారు. తీసుకున్న రుణాలతో పచ్చళ్లు, కారంపొడి తయారీ, చిల్లరకొట్టు వ్యాపారం, కూరగాయల వ్యాపారం తదితర వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబాన్ని పోషించుకోవాలన్నారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు లక్ష్మణ్, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై మందుబాబు వీరంగం



వినుకొండ(నూజెండ్ల): ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు అద్దాన్ని ఓ యువకుడు మద్యం మత్తులో పగులగొట్టాడు. వినుకొండ డిపోకు చెందిన ఇంద్ర ఏసీ బస్సు బుధవారం రాత్రి 10.30గంటల సమయంలో ప్రయాణీకులతో హైదరాబాద్‌కు వెళ్తుండగా కారంపూడి రోడ్డు లో పెట్రోల్ బంక్ వద్ద బస్సు దగ్గరకు రాగానే ఇనుపరాడ్డు బస్సు పైకి విసిరాడు. దీంతో బస్సు డ్రైవర్ సదరు యువకుడిని వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు

సత్తెనపల్లి: సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జరిగితేనే 100 శాతం అక్షరాస్యత సాధ్యం అవుతుందని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు సత్తెనపల్లి పట్టణంలోని బెడ బుడిగ జంగాల కాలనీలో గురువారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన పై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారిని పనులకు పంపించకూడదన్నారు. పనుల్లో చేర్చుకొన్న ఆ సంస్థ యజమానులపై కానీ, సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోని కేసులు నమోదు చేయవచ్చునన్నారు. ముందుగా అక్కడకు వెళ్లిన టీం అక్కడ ఉన్న ప్రతి చిన్న పిల్లవాడిని పలకరించి వారు ఎక్కడ చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. మరో న్యాయవాది లక్ష్మణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను 14 సంవత్సరాలు వచ్చే వరకు ఖచ్చితంగా పాఠశాలలకు పంపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో దుకాణాల్లో కానీ పరిశ్రమల్లో కానీ, వ్యవసాయ పనులకు పంపకూడదన్నారు. అలా చేస్తే చట్టపరంగా కార్మిక శాఖ వారు చర్యలు తీసుకోని కేసులు నమోదు చేస్తారన్నారు. కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజాలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురిలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో కళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టామహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణలు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా దేవాలయ వేదపండితులు రాష్ట్ర మంత్రి అంబటిని, యర్రం వెంకటేశ్వరరెడ్డి, రాజనారాయణలను మేళ తాళాలతో దేవాలయంలోకి ఆహ్వానం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద నూతనంగా ప్రతిష్ఠించిన అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీమడేల్ పరమేశ్వరస్వామికి నూతనంగా నిర్మించిన దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారి వెంట పార్టీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మ శ్రీనివాసరావు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీటీసీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్నాను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ

కోడెల శివరామ్ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేబూని ఎన్టీఆర్ భవన్ వరకు ర్యాలీ



పట్టణంలో ప్ల కార్డులతో ర్యాలీ చేస్తున్న కోడెల శివరామ్

సత్తెనపల్లి: ప్రాణం ఉన్నంత వరకు టీడీపీకీ కోసం కోడెల శివప్రసాదరావు పని చేశారని టీడీపీ నియోజకవర్గ నాయకుడు కోడెల శివరామ్ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయం నుంచి పార్టీశ్రేణులతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణను వ్యతిరేకిస్తూ గురువారం రాత్రి ప్లకార్డులతో ఎన్టీఆర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కోడెల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోడెల శివరామ్ మాట్లాడుతూ కోడెల శివప్రసాదరావు చనిపోయిన తరువాత కొంతమంది నాయకులు కుట్ర చేస్తూ తమ కుటుంబానికి అన్యాయం చేయాలని చూశారని, అధి నాయకత్వానికి తమకు దూరం పెంచాలని ఎన్నో కుట్రలకు తెర లేపారన్నారు. కార్యకర్తల కోసం కార్యాలయం నిర్మిస్తే అక్కడికి ఎవ్వరూ వెళ్లకూడదని ఆంక్షలు విధించారన్నారు. కోడెలను పార్టీ నుంచి దూరం చేయటానికి కుట్ర చేస్తుంటే అధిష్టానం ఎందుకు పట్టించు కోవడం లేదని ప్రశ్నించారు. ఎందుకు తమ కుటుంబానికి అండగా నిలవడం లేదన్నారు. కోడెల శివ ప్రసాదరావు మృతిచెందినపుడు ప్రభుత్వం ప్రభుత్వ లాంఛనాలు ఇవ్వాలని వస్తే ఒక కొడుకుగా బాధ్యత ప్రకారం మా తండ్రి నడిపిన ప్రమాణాలు, ఆయన నిర్వహించిన పదవులు, ఆయన తెచ్చిన గౌరవానికి ప్రభుత్వం ద్వారా లాంఛనాలు జరగాలని కోరుకున్నానన్నారు. కానీ పార్టీ ఆదేశించడంతో ప్రభుత్వ లాంఛనాలను తిరస్కరించానన్నారు. నాలుగేళ్ళ నుంచి ఒక ప్రణాళిక ప్రకారం కోడెల కుటుంబాన్ని కార్యకర్తల నుంచి దూరం చేయాలని, కోడెల పేరు వినపడకూడదని ఒక కుట్ర జరుగుతుందన్నారు. వీటి పై జిల్లా, రాష్ట్ర అధ్యక్షులకు చెప్పుకోవడం జరిగిందన్నారు. తమకు జరుగుతున్న కష్టాలను, తమ తల్లి, తమ కుటుంబ సభ్యులందరూ కలిసి తండ్రి స్థానంలో ఉన్న చంద్రబాబును కలిసి, ఆయన దృష్టికి తీసుకు వెళ్ళాలని చూశామన్నారు. ఎంతో మంది పార్టీకి సేవ చేసిన కుటుంబాలకు గౌరవం ఇవ్వడమే గాక వారి వారసులకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించారని, కానీ తమ విషయంలో ఎందుకు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్



నందిగామలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ప్రదీప్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 226 మందికి పరీక్షలు చేయగా జనరల్ ఓపీ 35 మంది, హైపర్ టెన్షన్ 63 మంది, డయాబెటిస్ 38 మంది, హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటిస్ 101 మంది, గర్భిణులు 11 మంది, బాలింతలు ముగ్గురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఆరుద్ర గణేష్, హెల్త్ అసిస్టెంట్ షేక్ సుభాని, డీఈఓ సుధాకర్, ఆశా కార్యకర్తలు పి.శివపార్వతి, ఎస్.కోటేశ్వరమ్మ, ఎం.నాగలక్ష్మీ, తదితరులు ఉన్నారు. అలాగే లక్కరాజుగార్లపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా డాక్టర్ అనూష గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 168 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో జనరల్ ఓపీ 28 మంది, హైపర్ టెన్షన్ 61 మంది, డయాబెటిస్ 24 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 35 మంది, గర్భిణులు 18 మంది, బాలింతలు నలుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కె.సురేష్, హెల్త్ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు, డీఈఓ జి ఇజ్రాయిల్, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగుడికి రూ.2.5 లక్షల చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్



దివ్యాంగుడికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని ఏనుగుపాలెంకు చెందిన దివ్యాంగుడు గుడిపూడి అంకారావుకు (పి.ఎం.ఈ.జి.పి) ప్రధానమంత్రి గ్రామీణ ఇన్ కంజనరేషన్ పథకం ద్వారా గ్రామంలో చిన్న తరహా పరిశ్రమ బంగాళదుంప చిప్స్ తయారీ ఏర్పాటుకు కలెక్టర్ తోడ్పాటు అందించారు. గతంలో అంకారావు ఈ పథకం ద్వారా ఉపాధి పొందేందుకు కలెక్టర్ ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుడు చెల్లించాల్సిన మార్జిన్‌మనీ సరిపడినంత లేకపోవడంతో, కలెక్టర్ స్పందించి తగినంత ఆర్థిక సహకారం అందించారు. దీంతో ఏనుగుపాలెం కెనరాబ్యాంక్ అధికారులు లబ్ధిదారుడు అంకారావు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన యంత్రసామాగ్రి కొనుగోలుకు రూ.2.50 లక్షల చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారుడు అందుకున్నారు. ప్రభుత్వం అందించిన సహకారాన్ని వినియోగించుకొని పరిశ్రమలు స్థాపించి, బ్యాంకు రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ, జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని లబ్ధిదారునికి సూచించారు. కార్యక్రమంలో సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

కౌలు వేలం వాయిదా

క్రోసూరు: సత్తెనపల్లి మండలంలోని బృగుబండ గ్రామంలో గల జగన్నాథస్వామి దేవస్థానం భూముల కౌలు వేలం వాయిదా పడినట్లు ఈఓ. రంగిసెట్టి సూరినారాయణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2 వ తేదీ, శుక్రవారం మండలంలోని గుడిపాడు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించాల్సిన జగన్నాథస్వామి దేవాలయం భూముల (29.18 ఎకరాల) కౌలు వేలం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియపరచనున్నట్లు ఈఓ వివరించారు.

గోదాముకు భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం సొసైటీ పరిధిలో గుంటుపాలెం గ్రామంలో రైతుభరోసా గోదాం నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కారుమంచి సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు ప్రభుత్వ స్థలం 33 సెంట్లు వ్యవధిలో రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నులు గోదాం పనులకు భూమి పూజ చేపట్టగా నాలుగు నెలల వ్యవధిలో పనులు పూర్తి అవుతాయన్నారు.

ఆరంభమైన ప్రతిష్టా కార్యక్రమాలు

వినుకొండ టౌన్: పట్టణంలోని మార్కాపురం రోడ్డు నందుగల రావి చెట్టు రంగా బొమ్మ సెంటర్‌లో శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలియచేశారు. శనివారం గణపతి పూజ, ఘర్తాన్యాసము, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

కౌలు రైతు అర్హత కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నాదెండ్ల: అర్హులైన కౌలు రైతులు రుణ అర్హత కార్డులను పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారుల వద్ద దరకాస్తు ఫారాన్ని తీసుకుని సాగు రైతుల నుంచి పాస్‌బుక్ జిరాక్స్‌తో పాటు వారి ఆధార్ కార్డు, ఆమోద పత్రం తీసుకుని కౌలు రైతు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్‌తో సహా గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలన్నారు. పరిశీలించిన వీఆర్వోలు రుణ అర్హత కార్డులను మంజూరు చేస్తారని, గ్రామ సభల ద్వారా వాటిని కౌలు రైతులకు అందిస్తామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన గౌరవరపు రాంబాబు(43) ప్రైవేటు ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తుంటాడు. గత నెల 5వ తేదీ విద్యుత్ పనులు చేయడానికి విద్యుత్ లైన్‌మెన్‌తో కలసి వెళ్లాడు. గ్రామంలోని క్వారీ వద్ద విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా హై టెన్షన్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన రాంబాబును గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియంత్రణ చర్యలతో వ్యాధులు దూరం



వెంగళరెడ్డి నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: కీటక జనిత వ్యాధుల నియంత్రణలో ప్రజాభాగస్వామ్యం తప్పనిసరి అని వెంగళరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ షేక్ సిరాజున్నిసా అన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం జూన్ 2023 మాసాన్ని మలేరియా వ్యతిరేక మాసంగా ప్రకటించడంతో గురువారం ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరాజున్నిసా మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు మొదలైన వ్యాధుల గురించి వివరించి, రాకుండా చేపట్టవలసిన చర్యలు గురించి తెలిపారు. ప్రజలందరూ నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ హెల్త్ సూపర్వైజర్లు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్ ఎంపీ కిరణ్ బాబు, ఎస్ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, హెల్త్ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధూమపానంతో ఊపిరితిత్తుల క్యాన్సర్



ఫణిదంలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి: పొగతాగుటం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుందని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పి.హెచ్.సి.వైద్యాధికారి డాక్టర్ వేమవరపు ప్రదీప్ ఆధ్వర్యంలో గ్రామంలో పొగాకు వ్యతిరేక ర్యాలీ గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలచే పొగాకు, గుట్కా వాడకాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు నములుట, గుట్కా, పాన్ పారాగ్ వంటి ఉత్పత్తులు నములుట వలన గొంతు క్యాన్సర్, జీర్ణాశయ కాన్సర్, నోటి కాన్సర్ వంటి వ్యాధులు సోకి మరణానికి దారితీస్తాయని తెలియజేశారు. హెచ్ఈఓలు పి.వెంకటరావు, ఖదీర్, డీపీఎం నాగేశ్వరరావు నాయక్, పి.హెచ్.యస్. మీనాక్షమ్మ, పంచాయతీ కార్యదర్శి వీరాంజనేయులు, చైతన్య, మహిళా పోలీస్, పి.హెచ్.సి.సిబ్బంది పాల్గొన్నారు.

ధూళ్లిపాళ్ల మాజీ సర్పంచ్ రుక్మిణమ్మ మృతి



రాయపాటి రుక్మిణమ్మ (ఫైల్)



రుక్మిణమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాయపాటి రుక్మిణమ్మ(70) గురువారం మృతి చెందారు. ఆమెకు భర్త పూర్ణ చంద్రరావు, ఒక కుమార్తె, ఇరువురు కుమారులు ఉన్నారు. 2006 నుంచి 2011 వరకు ఆమె సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించారు. గ్రామంలో రహదారులు, డ్రెయిన్‌లు, పాఠశాలల భవనాల నిర్మాణంతో పాటు 11 గ్రామాలకు మంచినీరు అందించే రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టారు. సుమారు రూ. 2.50 కోట్ల పై చిలుకు నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేశారు. రుక్మిణమ్మ మృతివార్త తెలుసుకున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు రుక్మినమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, రుక్మిణమ్మ కుమారుడు రాయపాటి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివనారాయణ, గణపవరం మాజీ సర్పంచ్ మర్రి సుబ్బారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలకా జయపాల్, సంకటి శ్యాంసన్, స్థానిక నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రజావసరాలు తీర్చటమే ప్రభుత్వ లక్ష్యం

- శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పడమటిపాలెంలో పర్యటన



మంచినీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: ప్రజావసరాలను తీర్చడంలో గ్రామాలకు మౌలిక సదుపాయాల ఏర్పాటులో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. స్థానిక పడమటి పాలెంలో గల శేషమ్మ చెరువులో రూ. 8 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేయగా, స్థానిక బొడ్రాయిసెంటర్లో గల శ్రీ లక్ష్మి తిరుపతమ్మ తల్లి ఆలయం ఎదుట రూ. 2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణమునకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు డా.గోపిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో మంచినీటి సౌకర్యం కోసం నిర్మించిన రెండు రక్షిత మంచినీటి ట్యాంకుల వలన ఉపయోగం లేకుండా పోయిందన్నారు. మంచి నీటి సమస్య పరిష్కారం కోసం పది ఎకరాల విస్తీర్ణంలో శేషమ్మ చెరువును బాగుచేయించి సాగర్ కెనాల్ నుంచి చెరువులోకి నీరు వచ్చే విధంగా చేయటం జరుగుతుందన్నారు. ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేసి పైపులైన్ల ద్వారా గ్రామంలో ఇంటింటికీ మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దీనికి మొత్తం సుమారు రూ. 8 కోట్ల రూపాయలు కేటాయించటం జరిగిందన్నారు. మొదటి విడతగా రూ.4.3 కోట్ల రూపాయలు, రెండవ విడతగా రూ.3.6 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. అదే విధంగా గ్రామంలో రూ.2.2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండపం నిర్మాణమునకు భూమిపూజ చేశారు. గ్రామంలో గల శ్మశాన వాటికలలో గల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో కేంద్రియ విద్యాలయానికి కేటాయించిన స్థలంలో త్వరలో విద్యాలయం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా వైఎస్సార్ యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, వీఆర్ఓ పడాల సుబ్బారెడ్డి, నాయకులు చపారపు సంజీవరెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, పి.మల్లిఖార్జునరెడ్డి, పడాల రమణారెడ్డి, కల్లి సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కోటప్పకొండలో నర్సరీల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ ప్రాంతంలో నర్సరీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలతో ఏర్పాటు చేసిన ఐదు నర్సరీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నర్సరీలకు కోటప్పకొండ ప్రాంతం అనుకూలంగా ఉంటుందన్నారు. ఉద్యానశాఖ సహకారంతో రైతులు నర్సరీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కోటప్పకొండ చుట్టుప్రక్కల పదిహేను గ్రామాల్లో మెట్టపైర్లు సాగు చేస్తారని, ముఖ్యంగా మిర్చి పంటలను అధికంగా వేస్తారని తెలిపారు. ఈ ప్రాంత రైతులు గతంలో మిరప నారు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు స్థానికంగా నర్సరీలు రావడంతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన నారు పెంపకాన్ని రైతులు పర్యవేక్షించవచ్చని తెలిపారు.

క్రీస్తు మార్గం అందరికీ ఆదర్శం



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సన్మానిస్తున్న ఏబీసీ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): దేవుని దృష్టిలో అందరూ సమానులే అనే భావన కలిగి ఉండాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో జీప్సీ చర్చిలో ఏబీసీ క్రైస్తవుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని సూచించారు. పేదరికాన్ని జయించాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందని గుర్తు చేశారు. క్రైస్తవ మిషనరీ సభ్యులు పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చర్చి పాస్టర్లు ఎమ్మెల్యే బొల్లాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏబీసీ ప్రెసిడెంట్ శామ్యూల్ కృపాకర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్,నాయకులు పాల్గొన్నారు.